# బుడుంగు

గేటు తెరుచుకుని లోపలికడుగు పెట్టాడు అప్పారావు. అటూ ఇటూ చూశాడు. కుడివైపు పోర్షనే గోపాల్రావుది! తలుపులు వేసున్నాయి. గుమ్మంలో తలొంచుక్కూర్చుని పలక మీద ఏదో రాసుకుంటున్నాడో ఐదేళ్ళ కుర్రాడు.

"బాబూ! గోపాల్రావు గారిల్లిదేనా?" అడిగాడప్పారావు.

"ఇదే" వాడు సమాధానం చెప్పాడు.

సమాధానం చెప్పిన వైఖరి కొంచెం పెంకెగా వుంది కాని, కుర్రాడు తెగ ముద్దొచ్చేస్తున్నాడు.

"నీ పేరేమిటోయ్?" అడిగాడప్పారావు.

"నీకెందుకు?" అన్నాడు వాడు.

"ఏం చెపితే తప్పా?" నవ్వాడప్పారావు

"తప్పేంలేదు, చెపితే దడుచుకుంటావ్" అన్నాడు వాడు

"అబ్బా! అలాగా! అయితే నీపేరు వీర నరసింహ వ్యాఘ్రేశ్వర రావయ్యుండాలి" అనేసి తన జోకుకి తనే విరగబడి నవ్వసాగాడు అప్పారావు.

"కాదు నాపేరు బుడుగు" గట్టిగా అరిచాడు వాడు.

అంతే! విరగబడి నవ్వుతున్న అప్పారావు తిరగబడి పోయాడు. మైగాడ్! వీడేనా బుడుగు! వీడు గోపాల్రావు కొడుకా?

తనకున్నది ఒకటే చొక్కా లాగూ! వీడితో ఎందుకులే!

"మీ నాన్నగారింట్లో వున్నారా?" చాలా మామూలుగా అడిగాడు

"ఉన్నారు" వాడింకా చాలా మామూలుగా చెప్పాడు.

"కొంచెం పిలుస్తావా?" అన్నాడు వాడికేసి చూడకుండా

"నువ్వే పిలుచుకో" అన్నాడు వాడు రాసుకుంటూ

మాట్లాడకుండా తలుపు తట్టాడప్పారావు. ఎవరూ పలుకలేదు. మళ్ళీ తట్టాడు. మళ్ళీ ఎవరూ పలుకలేదు.

"బుడుగూ! మీ నాన్నగారింట్లో ఉన్నారా?" అడిగాడు సందేహప్పారావు.

"ఒకసారి చెపితే నీకర్థం కాదా! మానాన్నా వున్నాడు. మా అమ్మా వున్నది. వాళ్ళిద్దరూ ఒకళ్ళకొకళ్ళు ప్రైవేటు చెప్పేసుకుంటున్నారు. నేనిక్కడ రాసుకుంటున్నాను" అన్నాడు వాడు నిక్కచ్చిగా,

ప్రైవేటేమిటి? అర్థం కాలేదప్పారావుకి, సర్లే, మనకెందుకని, తలుపు తట్టాడు. ఎన్నిసార్లు తట్టినా నో రెస్పాన్స్. ఏమిటి దారి? ఆలోచిస్తూ తలెత్తి చూశాడు అప్పారావు. మామిడి తోరణాల వెనక గొళ్ళెం బిగించి తాళం వేసుంది.

"బుడుగూ, అబద్ధాలు చెప్పడం నేర్చుకున్నావా? తప్పు కదూ" అన్నాడు అప్పారావు

"నేనబద్ధం చెప్పానంటే నిఝం కొరడా పుచ్చుకొ్కడతా నిన్ను జాగ్రత్త"! అన్నాడు వాడు.

"ఏడిశావ్! పైగా ఇదో దబాయింపా?" అన్నాడప్పారావు మందలింపుగా

"నువ్వలా అంటే నాకవమానం వేస్తుంది" అన్నాడు వాడు.

"ఓహో, అవమానమా? సర్లే, మీ అమ్మా, నాన్నా ఏరీ?" అడిగాడప్పారావు.

"లోపలున్నారని చెప్పాగదా?" అన్నాడు వాడు

"మరైతే బయట తాళం వేసుందేమిటి?"

"ఎక్కడ?"

"ఇక్కడ"

"ఇది మా యిల్లు కాదు"

"మరెవరిది"

"గోపాల్రావుగారిది"

"మరి నువ్వెవరబ్బాయివి"

"గోపాలం గారబ్బాయిని"



"మీ నాన్నగారేరీ?"

"లోపలున్నారు"

"ఉంటే పిలు"

"నువ్వే పిలుచుకో"

చచ్చాంరా నాయనా! వీడితో చచ్చే చావుగా వుందే? ఏమిటీ గోల అటూ యిటూ చూశాడు.

"నాయనా! బుడుగు! నీ కాళ్ళట్టుకుంటాను గోపాల్రావుగారింట్లో వున్నారా, లేదా? చెప్పు నాయనా!" అన్నాడు జాలిగా అప్పారావు.

"లేరు" చెప్పాడు వాడు

"మరిందాకట్నుంచి వున్నారన్నావు" కోపంగా అడిగాడు అప్పారావు

"నువ్విందాకట్నుంచి యిలా అడిగావా?" ఇంకా కోపంగా అన్నాడు వాడు.

" ఎలా అడిగాను" అన్నాడప్పారావు ఆశ్చర్యంగా

"మీ నాన్నగారున్నారా అడిగావు" అన్నాడు వాడు

"అది తప్పా?" అన్నాడప్పారావు

"తప్పా, తప్పున్నర తప్పా! నేను గోపాల్రావుగారి అబ్బాయిని కాను. ఇందాకే చెప్పాను. గోపాలంగారి అబ్బాయినని. మాది పక్క పోర్షను. మానాన్న ఇంట్లోనే వున్నాడు. కావాలంటే వచ్చి చూసుకో" అని వాడు పలక పుచ్చుకొని పక్క పోర్షను తలుపు తోసుకుని లోపలకెళ్ళిపోయాడు.

బయటి గుమ్మానికి వేలాడదీసిన దిష్టి గుమ్మడికాయకి ఇంకా ఎండిన పువ్వుంది కాబోలు! అమాంతం రాలి అప్పారావు నెత్తిన పడింది.